క్లుప్తంగా

అక్రమంగా మట్టి తరలింపు

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామం తుమ్మకుంటలో శనివారం జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా మట్టిని సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టేందుకు రెవెన్యూ, భూగర్భ జలాల శాఖాధికారుల నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల అక్రమంగా మట్టి తరలించిన జేసీబీ యజమానికి తహసీల్దార్ రూ. 50వేలు జరిమానా విధించినప్పటికీ, ఇతర ప్రాంతాల జేసీబీ యజమానులు పట్టపగలే అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈవిషయమై డీఈ కవితను వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత


బాండ్ పత్రాలు అందజేస్తున్న స్నేహితులు

హుజూరాబాద్: పట్టణంలోని గాయత్రి మార్బుల్ షాపు నిర్వాహకుడు, ఆర్ఎంపీ ఇప్పలపల్లి రవీందర్ నెలరోజుల క్రితం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. మృతుడి భార్య పేరిటా రూ.1,20,500 పోగు చేసి బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈమేరకు శనివారం ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేశారు. మృతుడి కుటుంబం భవిష్యత్ అవసరాల కోసం ఆర్థికసాయం ఉపయోగపడుతుందని స్నేహితులు తెలిపారు. కార్యక్రమంలో టి.రమేష్, శ్రీనివాస్, గోవర్ధన్, పరమేశ్, జ్ఞానేశ్వర్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన



మడిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో రైతు ప్రగతి ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంస్థ, కేవీకే ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని కాలుష్య నియంత్రణపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. జీవవైవిధ్యం, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో వివరించారు. అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జమ్మికుంట రైతు ప్రగతి సీఈవో సాగర్, ఎఫ్‌పీవో ఇన్‌చార్జి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యానును ఢీకొన్న కారు

శంకరపట్నం: కేశవపట్నం శివారు స్పీడ్ బ్రేకర్ సమీపంలో శనివారం వ్యానును కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న కరీంనగర్ పట్టణ ప్లానింగ్ అధికారి కిరణ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడ్డారు. కరీంనగర్ నుంచి సొంత గ్రామమైన వీణవంక మండలం కనపర్తి గ్రామానికి కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కారులో బయలుదేరాడు. మార్గమధ్యలో కేశవపట్నం శివారులో స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న వ్యాన్ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. వెనక వస్తున్న కిరణ్ అప్రమత్తమై బ్రేకులు వేసినా కారు వ్యానును ఢీకొట్టి ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోలపు భారతమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత నెలలో గోపాల్‌రావుపేట గ్రామ శివారులో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు ఏగోలపు మల్లేశం, ఏగోలపు భారతమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. భారతమ్మను ప్రైవేట్ వైద్యశాలకు తరలించి వైద్య చికిత్స అందిస్తుండగా.. శనివారం ఉదయం మృతిచెందింది.

‘డీఈఓను విధుల నుంచి తొలగించాలి’

సప్తగిరికాలనీ(కరీంనగర్): అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారిన జిల్లా విద్యాధికారి సీహెచ్.జనార్దన్‌రావుపై సమగ్ర విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించాలని సీపీఐ (ఎంఎల్) పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కులాన్ని బట్టి రూల్స్, మనిషిని బట్టి పనిష్మెంట్, వారి సర్వీస్ వివరాలు గోప్యంగా ఉంచడం, బహిర్గతం చేయకుండా దీని వెనుక ఉన్న ఉన్నత విద్యాధికారులపై కూడా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై పర్యవేక్షణ చేయకుండా తొత్తుగా మారిన డీఈఓపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇష్టం వచ్చినట్లు రూల్స్ పక్కనపెట్టి బదిలీలు చేయడం, పంపించడంపై కూడా విచారణ చేపట్టాలని కోరారు.



ప్రత్యేక పూజలు, అన్నదానం

చొప్పదండి: పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పుట్టిన రోజును పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బీరన్న కల్యాణోత్సవాలు

హుజూరాబాద్: పట్టణంలో బీరన్న కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం సాంప్రదాయం ప్రకారం లింగాలు తీయుట, గంగ బోనం అనంతరం డప్పుచప్పుల మధ్య ఊరేగింపు కార్యక్రమం ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్ యాదవ్, కౌన్సిలర్ మక్కపల్లి కుమారస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరేణి సమ్మయ్య తదితరులు ఉన్నారు.

దిగబడిన లారీ



మానకొండూర్: మండలంలోని చెంజర్ల వద్ద కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై శనివారం ట్రాఫిక్ అంతరాయం కలిగింది. చెంజర్ల వద్ద నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. దీంతో కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ లారీ చెంజర్ల వద్ద ఓ సీడ్ కంపెనీలో పేపర్లు తీసుకుందామని లారీ డ్రైవర్ రహదారి పక్కన లారీని నిలిపే ప్రయత్నం చేయగా లారీ టైర్లు నూతనంగా నిర్మిస్తున్న మట్టిలో కూరుకుపోయింది. దీంతో రహదారికి అడ్డుగా ఉండటంతో రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే సమయంలో నేషనల్ హైవే పనుల్లో భాగంగా కరీంనగర్ వైపు నుంచి చెంజర్ల వైపు వెళ్తున్న ఓ టిప్పర్‌కు ఈ ఘటన స్థలంలోనే విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ పోల్ విరిగి తృటిలో ప్రమాదం తప్పింది. రెండు ఘటనలతో అర్ధగంటకు పైగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జేసీబీ సహాయంతో కూరుకుపోయిన లారీని లాగడంతో యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

ఉన్నది ఇరుకైంది..

- రోడ్డు నిర్మించకుండానే డివైడర్ ఏర్పాటు
- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఇరుకురోడ్డుతో వాహదారులు, ప్రయాణికుల కష్టాలు


బస్టాండ్ సమీపంలో ప్రయాణికుల కష్టాలు

చొప్పదండి: విశాలంగా మారుతుందనుకున్న రోడ్డు ఇరుకైంది, అది కూడా గుంతల రోడ్డుగా మారింది, ఆహ్లాదకరంగా మారుతుందనుకున్న దారి ఆక్రమణకు గురవుతోంది, ఆరునెలలుగా ప్రయాణికులు అరిగోస పడుతున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదంటూ చొప్పదండి పట్టణ ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో రూ. 33 కోట్ల టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులతో రెండేళ్ల క్రితం చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు పట్టణ ప్రజలకు, ప్రయాణికులు, వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమించాయి. సెంట్రల్ లైటింగ్ పనులతో పట్టణ పోకడను సంతరించుకుంటుందనుకుంటే ఇప్పుడు అవే పనులు ప్రాణాంతకంగా మారాయి. ఇరుకు రోడ్డుతో పాటు, గుంతలమయమైన దారిపై తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటం, క్షతగాత్రులు ఆసుపత్రుల పాలుకావడం, అప్పుడప్పుడు రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవించడం తప్పా సెంట్రల్ లైటింగ్ పనులతో ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది.

పడకేసిన పనులు

సుమారు మూడు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ పనులు చేసేందుకు గతంలో ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు తెలంగాణ పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా రుణం మంజూరుకు ప్రతిపాదనలు పంపించడంతో పనులు ప్రారంభించారు. పట్టణంలోని రాయపట్నం, కరీంనగర్ రహదారిపై వంద అడుగుల దారిపై మూడు కిలోమీటర్ల మేర అభివృద్ధిచేస్తామని చెప్పి రోడ్డు పొడుగును అంతకంటే తక్కువ దూరానికే కుదించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వేగంగా నిర్వహించిన పనులు ఎన్నికల ముందే పడకేశాయి. ఆరు నెలలుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. రోడ్డు పక్కన వంద అడుగుల రోడ్డును ఆక్రమించి చేసిన నిర్మాణాలను తొలగించడంలో అప్పటి అధికారులు పక్షపాతం చూపినట్లు విమర్శలు వచ్చాయి. ఆపై డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యతను అధికారులు పర్యవేక్షించ లేదని ఆరోపణలు వచ్చాయి. అధికారులు కాంట్రాక్టర్లకు కొమ్ము కాయడంతోనే తారురోడ్డు నిర్మించకుండా డివైడర్లు నిర్మించారని పట్టణ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇంజినీరింగ్ పరిజ్ఞానం లేకుండా రోడ్డు పనులు ఎలా నిర్వహిస్తారని, రోడ్డు విస్తరించకుండా డివైడర్ నిర్మించడంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇక విద్యుత్ టవర్ల నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోయాయి.

నిబంధనలు పాటించని వైనం

ప్రధాన రోడ్డుపై గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి డీ86 కాలువ సమీపం వరకు ప్రస్తుతం డివైడర్ నిర్మించారు. ఇంతకు ముందు 33 అడుగుల తారు రోడ్డు ఉండగా, ఇదే తారుపై డివైడర్ ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. నిబంధనల ప్రకారం రోడ్డు సెంటర్ నుండి ఇరువైపులా కనీసం ఏడు మీటర్ల మేర తారు నిర్మించాకే డివైడర్ ఏర్పాటు చేయాలని, ఈ నిబంధనలను అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుంగలో తొక్కారని విమర్శలు వచ్చాయి. ఇక మట్టి రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో వ్యాపారులు రోడ్డును ఆక్రమించారు. దీంతో రోడ్డు కుచించుకుపోతోంది. రోడ్డుపై గుంతలు ఏర్పడి చిన్నపాటి వర్షాలకే నీటితో నిండి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో దుమ్ము లేచి ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు.

పనులు కొనసాగుతాయి..

రోడ్డు విస్తరణ పనులు మళ్లీ కొనసాగుతాయి. ఎన్నికల కోడ్‌కు ముందు రోడ్డుపనులపై సమీక్ష నిర్వహించాం. ఎన్నికల కోడ్ ముగిశాక రోడ్డు పనులకు సంబంధించిన అంశాలపై దృష్టి సారిస్తాం. టీయూఎఫ్ఐడీసీ అధికారులతో మాట్లాడాల్సి ఉంది.

– నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

పంచాయతీ కార్మికుడికి గాయం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో శనివారం విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తుండగా పంచాయతీ కార్మికుడు ర్యాకం శంకర్ ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వీధి లైట్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను శంకర్ కొడుతున్న క్రమంలో చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. వెంటనే శంకర్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శంకర్‌కు ఎడమ చేయి విరగడంతో వైద్యులు కట్టు కట్టారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శిక్షణ

శంకరపట్నం: మండలంలోని శ్రీబ్రహ్మ విద్యాశ్రమంలో శనివారం విశ్వహిందూపరిషత్ –మాతృశక్తి ఆధ్వర్యంలో అభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సునీతారామ్ మహిళలకు హిందూ ధర్మ విలువలు, సత్సంగం, దేవాలయాలు, సామూహిక పూజలు, పండుగల ద్వారా హిందూ ధర్మాన్ని రక్షించే విధంగా భాగస్వాములను చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో లక్ష్మి సరోజిని, ఉషారాణి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సునీతారామ్

కుట్టు శిక్షణ ప్రారంభం

శంకరపట్నం: మండల కేంద్రంలో శనివారం డీఆర్డీఏ, బీపీఎం రవీందర్ స్వశక్తి మహిళల కోసం శనివారం కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టేందుకు సరిపడా క్లాత్, సరుకులు అందించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇట్టి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రవీందర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు అనిత పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న పీడీ

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


ఇల్లందకుంట: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: అకాల వర్షాలకు తడిసిన ధాన్యానికి బోనస్ ఇచ్చి కొనుగోళ్లు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతుందని, కొనుగోళ్లలో చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకురూ.500 బోనస్ చెల్లించాలన్నారు.

ఇల్లందకుంట: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. ఎన్నికలకు ముందు క్వింటాల్‌కు రూ. ఐదువందల బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీనివిస్మరించారని అన్నారు. ధాన్యం కొనుగోలుకు ముందు సంబంధిత అధికారులతో సమావేశంఏర్పాటు చేసి సమీక్ష జరుపాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. సమీక్ష పేరిట రైతులను మభ్యపెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని, ధాన్యం అమ్ముకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఏ రకంగా నష్టాన్ని పూరిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలన్నారు. లేదంటే రైతులతోఉద్యమిస్తామని హెచ్చరించారు.

గన్నేరువరం: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ కోరారు. గన్నేరువరంలోని తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కుప్పలపై కప్పడానికి రైతులకు టార్పాలిన్ల కవర్లు ఇవ్వకపోవడం వల్లనే వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. క్వింటాల్‌కు రూ. 500 బోనస్ రబీ నుంచే వర్తింపచేయడంతో పాటు రూ. రెండులక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రామడుగు: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంను రెండు రోజుల్లో కొనుగోలు చేయకపోతే ఆందోళన లు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. మండలంలోని షానగర్ గ్రామ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఇందుర్తి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కేంద్రాల్లో పోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయినందున ప్రభుత్వం షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వెంట బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండలకార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


చిన్నముల్కనూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెడ్పీఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్

చిగురుమామిడి: రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నెలరోజులకు పైగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సజావుగా సాగాయని జెడ్పీఫ్లోర్ లీడర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గీకురు రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని పీచుపల్లి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ధాన్యపు రాశులు తడవలేదన్నారు. మూడు గ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తి అయినట్లు చెప్పారు. ఈ సీజన్‌లో 1943 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని, చివరి గింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వెంట చిన్నముల్కనూర్ గ్రామశాఖ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్, నాయకులు గజ్జెల రాములు, ముస్కు ప్రభాకర్‌రెడ్డి, పైడిపెల్లి సతీశ్, మర్రి శ్రీనివాస్, గుల్ల సదానందం, గట్టు ప్రశాంత్, కల్వల రాజేశ్వర్‌రెడ్డి, పైడిపెల్లి చంద్రయ్య, నవీన్, మధు, రాజు పలువురు ఉన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం


సిరి చందనను సన్మానిస్తున్న వంశీకృష్ణారావు

కరీంనగర్‌స్పోర్ట్స్: హాంకాంగ్‌లో ఈనెల 6 నుంచి 11 వరకు జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న జిల్లాకు చెందిన తుడి సిరిచందన ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించి జాతీయ పతాకాన్ని ఎగురవేసింది. 52 కేజీల విభాగంలో పోటీ అత్యధిక స్కోర్ సాధించి గోల్‌మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా శనివారం సిరిచందనకు సహకారం అందించిన కరీంనగర్‌లోని ద్వారకామయి మల్టీస్పెషలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వంశీకృష్ణరావు శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. కోచ్ మల్లేశ్, రాజమహేందర్, రాజేశ్, వినీత్ మోహన్, రాజేశ్‌రెడ్డి, శ్రావణ్, శ్రీకాంత్‌లు అభినందించారు.

నేటి నుంచి మల్లికార్జునస్వామి ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఆదివారం నుంచి శ్రీ జీల్గుల మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సాయిని మధు, కార్యదర్శి గోనె ఎల్లారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు గ్రామస్తులు ఎడ్లబండ్లతో ఆల యం వద్దకు ఊరేగింపుగా తరలివెళ్తారని వివరించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో రాత్రి పుట్టబంగారం తీసుకొచ్చి పట్నం వేసి మల్లిఖార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. సోమవారం నాగవెల్లి పట్నం వేసిన అనంతరం మహిళలు బోనా లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించడంతో ఉత్సవాలు ముగుస్తాయని అన్నారు.

గుర్తింపు పాఠశాలల్లో చదివించండి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు పొందని పాఠశాలలో చదివిస్తే ఏమైనా సమస్యలు తలెత్తితే జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి బాధ్యత వహించదని, ప్రభుత్వ పరంగా కూడా ఎలాంటి చర్యలు ఉండవని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యా సంవత్సరం చివరి దశకు వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని, 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖలోనే రూ.114కోట్ల బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు.

కేసులు ఉపసంహరించండి

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యమకాలంలో అన్ని వర్గాల ప్రజలపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ టీపీసీసీ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి సచివాలయం ద్వారా వినతిపత్రం అందజేశారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో ఫెలోషిప్స్ స్కీంను పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థులకు మంజూరు చేయాలని అన్నారు. జూన్ 2న 10వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు సోనియా గాంధీ పేరుతో ఫెలోషిప్స్ స్కీంను ప్రారంభించాలని కోరారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: రెండు రోజులుగా రాష్ట్రంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్ యార్డు, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని, పండ్ల తోటలు మామిడి, సపోటా, బొప్పాయి ఈదురుగాలులకు నేలమట్టమై తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి ప్రభుత్వానికి అంచనాలు అందించాలని కోరారు. సన్న రకం, దొడ్డు రకం అని తేడా లేకుండా రూ.500 బోనసును వెంటనే అందజేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.